క్లుప్తంగా

బాలిక విద్యపై అవగాహన



వీపనగండ్ల: బాలికలు విద్యలో రాణించి, ఉన్నత శిఖరాలను చేరుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలంగాణ సాంస్కృతిక కళాకారులు తమ ఆట పాటల ద్వార ప్రజలకు వివరించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం పలు కళా రూపాలను ప్రదర్శించిన కళాకారులు బాలికల విద్యతో పాటు క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, మద్యం లాంటి వాటికి యువకులు బానిసలు కాకుండా ఉండాలని తమ ఆట పాటల ద్వార వివరించారు.

పరామర్శ



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని సీనియర్ జర్నలిస్టులు పోలిశెట్టి బాలకృష్ణ, పోలిశెట్టి సురేష్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా సీనియర్ జర్నలిస్టులు శుక్రవారం వారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి జర్నలిస్టుల తరుపున అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జయప్రకాశ్, రమేష్, లక్ష్మణ్, అంజి, అశోక్‌రెడ్డి, ఈశ్వర్, రాము, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన విజ్ఞేష్ అనే నిరుద్యోగి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. తన తోటి మిత్రులు శుక్రవారం అతడికి రూ.53వేల ఆర్థికసాయం అందజేశారు. 1999–2000 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థి, నిరుద్యోగిగా ఉంటూ పేద విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఎన్నో సేవలు అందిస్తున్న విజ్ఞేష్ అనారోగ్యానికి గురికావడం బాధాకరమని, అతను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తోటి మిత్రులు కోరారు. ఆర్థికసాయం అందించిన వారిలో సువర్ణ, రాజు, గంగులు, రాముడు, సురేందర్, కుర్మయ్య, నారాయణ, నరేందర్, రంజిత్, ప్రవీణ్, గణపతి, చిన్నరాముడు, వీరస్వామి నర్సింహ ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



పెబ్బేరు రూరల్: బీజేపీ వనపర్తి జిల్లా నూతన అధ్యక్షుడిగా డి నారాయణ నియమితులైయ్యారు. శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వనపర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు భగవంతుయాదవ్, మండల కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డితో కలిసి ఆయనను శాలువాతో సన్మానించారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



ఆత్మకూర్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లను అందించారు. మండలంలోని జూరాలలో శిక్షణ పొందిన 38 మంది మహిళలకు శుక్రవారం భవన నిర్మాణ కార్మిక రంగ అధికారి మహేష్, ఎన్ఏసీ సంస్థ ఏడీ నిజలింగప్ప, సర్పంచ్ మహిమూద చేతుల మీదుగా కుట్టు మిషన్లు అందించారు. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా రానించి, ఇతరులకు ఆదర్శంగా నిలువాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకురాలు కవిత, ఉపసర్పంచ్ మొగిలన్న, నిర్వాహకులు సరేష్‌కుమార్, కొండన్న ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించేందుకు గాను పౌష్టికాహారాన్ని ఎమ్మార్సీ నిర్వాహకులు అర్జున్ అందించారు. మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలల హెచ్‌ఎంలు ఎమ్మార్సీ వద్దకు శుక్రవారం వచ్చారు. వారికి సత్యసాయి ట్రస్టు వారు అందించిన రాగిపిండి, బెల్లం తదితర పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.



పేదరిక నిర్మూలనే లక్ష్యం

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చిక్కేపల్లి సర్పంచ్ బాలస్వామియాదవ్, పెంట్లవెల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్ కుమార్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం గ్రామంలో కేంద్ర ప్రభుభుత్వ పథకాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి, ఆయా పథకాలపై ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు గ్రామగ్రామాన తెలిసేలా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి అవాస్ యోజన, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్ యోజన, స్వచ్ఛభారత్, పీఎం స్వానిధి, ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, పెన్షన్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడు, బీజేపీ నాయకులు వెంకటేష్ యాదవ్, భాస్కర్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చిక్కేపల్లిలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో అధికారులు, గ్రామస్తులు

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ రెడ్డి, మండల అధ్యక్షుడు భగవంతుయాదవ్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. దేశంలో రైతులకు ఫసల్‌బీమా యోజన, దేశ భద్రత, సైనికులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారని, దేశంలో అర్హులైన ప్రతి మహిళకు ఉజ్వల సిలిండర్ల అందించారని కొనియాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మురళీధర్‌ఆచారి, ప్రధాన కార్యదర్శి నాగరాజుయాదవ్, బూత్ అధ్యక్షుడు జలంధర్, చందు రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

వీపగనండ్ల: మండలంలోని పుల్గర్‌చర్లలో శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. మా సంకల్ప వికసిత భారత్ యాత్ర కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల క్షయ వ్యాధి నుంచి బయపడొచ్చాని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథాకాలపై అవగాహణ

పెబ్బేరు రూరల్: వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా మండలంలోని అయ్యవారిపల్లిలో ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పలు వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్కల స్వాతి, డాక్టర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.



రంగాపురంలో..



అయ్యవారిపల్లిలో..



పుల్గర్‌చర్లలో..

ఎమ్మెల్యేకు సమస్యలు పట్టవా..

- 20 శాతం మిగిలిన విస్తరణ పనులు చేస్తలేరు
- స్పందించకుంటే ధర్నాకు దిగుతాం

వనపర్తి టౌన్: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి పట్టణ సమస్యలు పట్టవా అని మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ ప్రశ్నించారు. పట్టణంలో రోడ్ల విస్తరణలో మిగిలిపోయిన 20 శాతం పనులు పూర్తి చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యేకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పాత యూకో బ్యాంక్ మలుపు వద్ద అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను పురపాలక కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ముందు అభివృద్ధి చేస్తామని చెబుతూ, పనులు చేస్తే బిల్లులు రావని కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని, ఇదేం పద్ధతి అని నిలదీశారు. అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పట్టణాభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో ఎస్‌జీఎఫ్, టీఎస్ఐడీయూసీ కింద రూ.79 కోట్లు వచ్చాయని, వాటిని ఖర్చు చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నా.. అధికారుల సమన్వయ లోపంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందించకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ప్రచారం తప్పితే పనుల్లో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎంసీహెచ్‌లో మిగిలిపోయిన పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారు కృష్ణ, పాకనాటి కృష్ణ, సమద్, నాయకులు ఎల్ఐసీ కృష్ణ, స్టార్ రహీం తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

మట్టి, ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలో అనుమతి లేకుండా మట్టి, ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. గురువారం మధ్యరాత్రి కొందరు వ్యక్తులు మద్దిగట్ల సమీపంలో గల మహ్మద్ హుస్సేన్ చెరువు నుంచి మట్టిని టిప్పర్ల ద్వారా అక్రమంగా కొత్తకోట మండలం కనిమెట్టకు తరలిస్తున్నారని గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మూడు భారత్‌బెంజ్ టిప్పర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం టిప్పర్లను పట్టుకున్న విషయాన్ని మైనింగ్, మినరల్స్ శాఖ వారికి సమాచారం ఇచ్చి వారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.



మట్టి టిప్పర్లను చూపుతున్న ఎస్ఐ హరిప్రసాద్

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

పాన్‌గల్: మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు శుక్రవారం ఎస్ఐ వేణు, స్థానిక సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, ప్రేమ్‌కుమార్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. పోటీల నిర్వహణతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. విజేతగా నిలిచిన అంజి లెవన్ జట్టుకు రూ.25116 చెక్కు, షీల్డ్, ద్వితీయ బహుమతి ఆకునోనిపల్లెతండా జట్టుకు రూ.15,116 చెక్కు, షీల్డు అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, రాజవర్ధన్, రోషన్న, గట్టు, నిర్వాహకులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ, ప్రజాప్రతినిధులు

వ్యక్తి అదృశ్యం

పెబ్బేరు రూరల్: మూడు రోజుల నుంచి తన తమ్ముడు కనిపించడం లేదని పట్టణానికి చెందిన ఖదీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జయరాములు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఖాదర్‌పాషా రాఘవేంద్ర ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్నారు. ఇతడు మూడు రోజుల క్రితం ఇంటి నుంచి ఆస్పత్రికి వెళ్లారు. మళ్లీ తిరిగి ఇప్పటి వరకు ఇంటికి రాలేదని శుక్రవారం బాధితుడి అన్న ఖదీర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

ఆలయాలను శుద్ధి చేసుకోవాలి

వనపర్తి టౌన్: అయోధ్య రామమందిరం ప్రారంభ తేదీ సమీపిస్తుండడంతో ప్రజలు సమీప ఆలయాలను శుభ్రపరుచుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్, జిల్లా అధ్యక్షుడు నారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆలయాల శుద్ధి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని రామాలయంలో పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో ఆలయాన్ని శుభ్రపరిచారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న వెంకటేశ్వర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కోకన్వీనర్ ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సుగుర్రం, రాయన్నసాగర్, ఓంప్రకాశ్, ఎద్దుల రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో ఆలయాన్ని శుభ్రపరుస్తున్న బీజేపీ నాయకులు

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

పాన్‌గల్: అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర (ట్రస్టు) ఆధ్వర్యంలో పూజించిన అక్షింతలను శుక్రవారం మండలంలోని గోప్లాపూర్, శాగాపూర్‌లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు అనంతరం ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ పంచిపెట్టారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను తీర్థ క్షేత్ర కరపత్రం ప్రతి హిందువుల ఇంటికి చేరుస్తామని ఆయా గ్రామాల నాయకులు పేర్కొన్నారు. జనవరి 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే సందర్భంగా ఇళ్లలో పూజలు నిర్వహించేందుకు అక్షింతలు అందజేస్తున్నట్లు నాయకులు తెలిపారు. రామమందిరం ప్రారంభం రోజున అక్షింతలను తలపై వేసుకున్న ప్రతి ఒక్కరూ పునీతులు అవుతారన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాణి, మౌనికయాదవ్, నాయకులు పుల్లారావు, రాజాగౌడు, విష్ణు, తిరుపతియాదవ్, బాలయ్య, మల్లేష్, శివరాముడు తదతరులు పాల్గొన్నారు.

సుధాకర్‌రావు నియామకంపై హర్షం

పాన్‌గల్: బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా ఎల్లేని సుధాకర్‌రావు రెండోసారి నియమాకంపై నియోజకవర్గ బీజేపీ నాయకులు అన్వేష్, రమేష్ మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజునాయుడు, వెంకటేష్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నియామకంతో జిల్లాతో పాటు కొల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం అవుతుందని వారి ఆశాభావం వ్యక్తం చేశారు.

బైక్‌ను ఢీకొన్న పాల వ్యాన్

కొత్తకోట రూరల్: పాల వ్యాన్ డ్రైవర్ అతివేగంగా నడపడంతో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న ఘటన గురువారం రాత్రి మండలంలోని సంకిరెడ్డిపల్లి స్టేజీ సమీపంలో గల గుంపు గట్టు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కానాయపల్లికి చెందిన రాము, వినోద్ అనే ఇద్దరు యువకులు బైక్‌పై వనపర్తికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. కొత్తకోట వైపు నుంచి వల్లభ పాల వ్యాన్ వనపర్తికి వెళ్తున్న క్రమంలో డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టెక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న రాము, వినోద్‌లకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంలో ఘటన స్థలానికి చేరుకున్న కానాయపల్లి గ్రామస్తులు క్షతగాత్రులను వెంటనే 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో వినోద్‌కు పరిస్థితి విషమంగా ఉన్నట్లు మెరుగైన చికిత్స నిమిత్తం ఇద్దరిని మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. క్షతగాత్రుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

బ్లేడ్‌తో చేయి కోసుకున్న యువకుడు

అమరచింత: మతిస్థిమితం లేని ఓ యువకుడు బ్లేడ్‌తో చేయి కోసుకొని స్పృహ కోల్పోయిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నచింతకుంట మండలం ఉంద్యాలకు చెందిన మతిస్థిమితం లేని జనార్దన్ అమరచింత పట్టణంలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. పట్టణంలోని ఆయా వీధుల్లో తిరుగుతూ చండూల్ బీడీ ఫ్యాక్టరీ పాత భవనం వద్ద బ్లేడ్‌తో చేతిని కోసుకున్నాడు. రక్తస్రావం కావడంతో స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు బంధువులకు సమాచారం అందించారు. రక్త గాయంతో పడి ఉన్న జనార్దన్‌ను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి సకాలంలో తరలించగా ప్రాణాపాయం తప్పింది.

గడ్డివాము దగ్ధం

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని శానాయిపల్లిలో కండె లక్ష్మయ్య అనే కౌలు రైతు గడ్డివాము దగ్ధమైంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల మేరకు.. తమ పశువుల కోసం సుమారు 500 కట్టల గడ్డి కండె లక్ష్మయ్య తన ఇంటి వద్ద కుప్ప వేసి పెట్టుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో అనుకోకుండా గడ్డివాము అంటుకుందని వెంటనే స్థానికంగా ఉండేవారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేయగా ఫైర్ సిబ్బంది మంటలు అదుపు చేసినట్లు సర్పంచు లక్ష్మి తెలిపారు. విషయాన్ని తహసీల్దార్ లక్ష్మీదేవి దృష్టికి కూడా తీసుకువెళ్లామని, రూ.లక్ష వరకు నష్టం జరిగి ఉంటుందని తెలిపారు.



ఇస్తెమా ధార్మిక సదస్సు జయప్రదం చేయండి

అమరచింత: జడ్చర్ల పట్టణంలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న ఇస్తెమా ధార్మిక సదస్సును జయప్రదం చేయాలని శుక్రవారం పట్టణంలోని జామియా మసీదులో గోడ, కరపత్రాలు విడుదల చేశారు. దావతే ఇస్లామి, ఇండియా (సున్నతో భరా) నిర్వహించే సదస్సులో ప్రవక్త సందేశాలు, అల్లా చూపిన మార్గం సమాజ్ ప్రాముఖ్యత గురించి వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జామియా మసీద్ కమిటీ సభ్యులు ఇమాం ఫరీద్ మౌజన్ గుల్ హమ్మద్ రఫి, పాషా, మైన్, అల్తాఫ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కొత్తకోట రూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో కొంతకాలంగా పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని, వెంటనే పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలని కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో దోమల నివారణకు మందు పిచికారీ చేయడంతో పాటు మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్, పినాయిల్, యాసిడ్ స్ప్రే చేయాలని కమిషనర్‌ను కోరారు. వేసవి కాలం సమీపిస్తుండటంతో నీటి సమస్య ఉండకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని కోరారు. డివైడర్ మధ్యలో నాటిన మొక్కలు పెరగడంతో యూటర్న్ తీసుకునే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే చెట్లను కట్టింగ్ చేయాలన్నారు. వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు వేల సంఖ్యలో కొత్తకోటకు రావడం జరుగుతుందని, అవసరం ఉన్నచోట పబ్లిక్ బాత్‌రూంల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్, కో ఆప్షన్ సభ్యుడు జేఎం మిషేక్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, కుమార్, కార్తీక్ ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

పెబ్బేరు రూరల్: జూరాల కాల్వ కింద పంటలు ఎండిపోకుండా నీటి విడుదలకు సహకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం పెబ్బేరు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వనపర్తి కలెక్టర్ కార్యాలయంలో ఈ 17న జరిగిన సమావేశంలో జూరాల కాల్వకు నీటిని విడుదల చేయించాలని మండల కాంగ్రెస్ నాయకులు వారికి విన్నవించారు. వారు స్పందించి సంబంధిత జూరాల అధికారులతో మాట్లాడగా జూరాలలో కేవలం తాగునీటికి సరిపోయేంతా నీరు ఉందని వారు వివరించారు. నారాయణపూర్ డ్యాం నుంచి 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించడానికి కర్ణాటక ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించి వారిని ఒప్పించారని వారు తెలిపారు. త్వరలో కాల్వకు నీటి విడుదల జరుగుతుందని, రైతులు ఎవరూ కూడా అధైర్యపడొద్దని చెప్పారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, గంధం సునీల్‌కుమార్, సర్పంచ్ రవీందర్‌నాయుడు, నరసంహ, రంగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

అమరచింత: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ప్రత్యేక ఓటు నమోదును ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కుకోసం దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. బూత్‌లో మృతి చెందిన ఓటర్లు ఉంటే వాటిని తొలిగించడం కోసం సమాచారం ఇవ్వాలని కోరారు. ఒక బూత్‌నుంచి మరో బూతుకు ఓటు మార్చుకునే ఓటరు ఫారం 8లో వివరాలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మణ్‌నాయక్, సీనియర్ అసిస్టెంట్ వెంకటయ్య, ఆర్ఐ గోపాల్, బీఎల్‌ఓలు తదతరులు పాల్గొన్నారు.



అమరచింతలో మాట్లాడుతున్న తహసీల్దార్ షేక్‌చాంద్‌పాషా

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువత ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న 2 రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో నూతన ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వరలక్ష్మి కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌ఓల ద్వారా ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ప్రార్థనాలయాలు శాంతికి చిహ్నాలు

ఆత్మకూర్: ప్రార్థనాలయాలు శాంతికి చిహ్నాలని, ప్రతి ఒక్కరూ ప్రతినిత్యం సమయం కేటాయించి అక్కడకి వెళ్లాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర కళ్లుగీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, పాస్టర్ సుమన్, కౌన్సిలర్ చెన్నయ్య అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో ఎంబీ యేరుషలేం చర్చి 39వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ నిబంధనలను పాటిస్తూ ప్రేమ అనురాగాలతో కలిసి జీవించాలని ప్రభువు ఏసుక్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని, ఈర్ష, అసూయ, ఇతర చెడుమార్గాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

చర్చి అభివృద్ధికి రూ.5 లక్షలు

ఖానాపూర్‌లో ఎంబీ యేరుషలేం చర్చి అభివృద్ధి కోసం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ద్వారా రూ.5 లక్షలు నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని కేశం నాగరాజుగౌడ్ ప్రకటించారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, తులసీరాజ్, రహ్మతుల్లా, రవీందర్, బాబు, మహేందర్‌రెడ్డి, అస్మతుల్లా, ఎండీ రఫీక్, నాగేష్, షంషేర్, గోపాల్, రాజు, కుర్వ రవి, క్రైస్తవులు పాల్గొన్నారు.



నాగరాజుగౌడ్‌ను సన్మానిస్తున్న క్రైస్తవులు

మొక్కలను సంరక్షిద్దాం

గోపాల్‌పేట: మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ రెండు మొక్కలు నాటాలని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థినులు అన్నారు. మూడు నెలల క్యాంపులో భాగంగా మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ (ఎన్ఎస్ఎస్) విద్యార్థినులు శుక్రవారం రేవల్లి మండలంలోని చెన్నారంలో మొక్కలు నాటడంతో పాటు గ్రామంలో తిరిగి చెట్లు పెంచడం వల్ల కలిగే లాభాలను వివరించారు. మొక్కలు పెంచడం వల్ల కలిగే లాభాలను వివరించారు. మొక్కలు నరకడం వల్ల అడవులు అంతరించి మానవుల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. హరితహారం కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటేందుకు తప్పనిసరిగా ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థినులు షేక్‌రమీజా, దివ్య, సాయిప్రియ, సుప్రజ, మౌనిక, స్వాతి, గౌతమి పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకులకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్యారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశామన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు చెప్పిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బసిరెడ్డి, మన్యం, రంగారెడ్డి, బోయ వెంకటయ్య, కావలి తిరుపతయ్య తదితరులు ఉన్నారు.